

# నిద్ర

తాంజీ ప్రసాద్

**వెం**కట్రావు నిద్రకి మొహం వాచిపోయాడు. ప్రతిరోజూ ఉదయం నాలుగున్నరకి అలారం పెట్టుకుని లేచి, తనతోనే లేచిన భార్య చేసి ఇచ్చిన కాఫీ గొంతులో పోసుకుని, అన్ని పనులూ ముగించుకుని టిఫిన్ డబ్బా, భోజనం కారియర్ తీసుకుని ఇరవై మైళ్ల దూరంలో ఉన్న ఆఫీసుకి బయలుదేరేవాడు. రెండు బస్సులు మారి పావుగంట ముందరే ఆఫీసుకి చేరుకుని తెచ్చుకున్న టిఫిన్ తిని పనిలో మునిగిపోయేవాడు. ఉదయం అయిదు గంటలకు కారియర్‌లో పెట్టిన భోజనం మధ్యాహ్నం ఒంటిగంటకు తినేవాడు.

కాలం, డబ్బు విలువ గుర్తించిన వెంకట్రావు ఒకే ఒక కొడుకుని చదివించడానికి ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. గ్రాడ్యుయేట్ కూడా కాని తనకి రెండున్నర వేల జీతం లభించడం గొప్పే అని సంతృప్తి పడ్డాడు.

అందుకే నాలుగున్నరకి లేచి ప్రతిరోజూ ఆఫీసుకి తయారయ్యేవాడు. భార్యతో "ఇంటి పని పూర్తయ్యాక మధ్యాహ్నం ఒక రెండు గంటలసేపు నిద్రపో, తలుపుకి సంచీ తగిలించి ఉంచు, పాలమనిషి అందులో పాల పాకెట్ పడేస్తుంది. నిద్ర పాడుచేసుకోకు! నిద్రకన్నా లభించే గొప్ప వరం లేదు!" అని వివరిస్తూ అన్ని విషయాలకన్నా నిద్ర విషయంలో భార్యని మరీ ముద్దుగా చూసుకునేవాడు.

కొడుకు గ్రాడ్యుయేటయ్యాక, పై చదువులు ఓపెన్ యూనివర్సిటీలో చదివిద్దామని ఉద్యోగంలో చేర్పించాడు. కొడుకు ఆఫీసు సైకిల్ మీద వెళ్లగలిగిన అరమైలు దూరంలో ఉన్నందుకు, ఆఫీసు టెన్ టు ఫైవ్ అయినందుకు కొడుకు కన్నా వెంకట్రావే ఎంతో ఆనందించాడు. నిద్రని త్యాగం చేయవలసిన ఉద్యోగం కొడుకుది కానందుకు ఎంతో మురిసిపోయాడు.

ఉదయం అంత చప్పున లేవడం, అంత దూరం బస్సులలో ప్రయాణం చేయడం, ఆ తర్వాత పనిలో మునిగిపోవడం వలన ఇంటికి వచ్చి కాఫీ తాగి స్నానం చేసి అరగంట తర్వాత భోజనం చేసి తొమ్మిదికే నిద్రపోయేవాడు వెంకట్రావు. సెలవు రోజులలోనూ, ఆదివారాలలోనూ అతి ముఖ్యమైన పనులకే బయటకు వెళ్లేవాడు. ఇంట్లోనే చదువుకుంటూ, టి.వి. చూస్తూ భార్యతోనూ, కొడుకుతోనూ ఆనందంగా గడిపేవాడు.

ఆదివారాలు, సెలవురోజులలో నాలుగున్నరకే మెలకువ వచ్చినా, బలవంతంగా మరో గంటన్నర నిద్రపోయేవాడు.

అలా తెల్లవారుజామున ముంచుకొచ్చే నిద్రని త్యాగం చేసి ముప్పయ్యేళ్ల సర్వీసు వెంకట్రావు పూర్తిచేశాడు. ఆరోజున ఆఫీసులో వెంకట్రావుకి చిన్న ఎత్తున వీడ్కోలు విందు ఇచ్చారు. వేంకటేశ్వరస్వామి ఫొటోకి ఫ్రేమ్ కట్టించి స్టాఫ్ బహూకరించారు. వెంకట్రావుని ఆదర్శ ఉద్యోగిగా ప్రశంసించారు. ఇంటికి కారులో మొదటిసారిగా దిగబెట్టారు.

ఇంటికి వచ్చిన వెంకట్రావు భార్యకి అన్ని విశేషాలూ చెప్పాడు. "రిటైర్ అయినందుకు కొంత విచారంగా ఉందనుకో, అయితే ఇక ఉదయం నాలుగున్నరకి నిద్ర లేవక్కరలేదు. అందుకు ఎంతో ఆనందంగా ఉంది. ముప్పయేళ్లపాటు అంత త్వరగా ఎలా నిద్ర లేచానో! ఇక పక్కింటి మూర్తిగారిలాగా మెల్లిగా లేస్తాను. రేపటినుంచీ అలారం పెట్టకు! నన్ను కొంప మునిగినట్లు లేపకు, నువ్వూ లేవకు!" అని భార్యను మంచం మీద కూర్చోపెట్టి మరీ చెప్పాడు.

"మీ ఇష్టం వచ్చినంతసేపు పడుకోండి, నా పని మటుకు తప్పుతుందా?" అంది రాజేశ్వరి.

ఆ రాత్రి సంతృప్తితో ఫాన్ ఫుల్ స్పీడులో పెట్టి, మస్కిటోకాయిల్ వెలిగించి, దుప్పటి తలదాకా లాక్కుని కళ్లు మూసుకున్నాడు.

మర్నాడు ఉదయం నాలుగింటికే మెలకువ వచ్చినా రాజేశ్వరి మరో గంటసేపు పడుకుని బద్దకం తీర్చుకుని లేచి బెడ్‌రూమ్ తలుపులు దగ్గరగా వేసి తన పనిలో నిమగ్నమైపోయింది.

ఎనిమిదయింది. మరీ ఇంత నిద్రా అని బెడ్‌రూమ్‌లోకి వచ్చి భర్తని "ఏమండీ! లేవండీ, ఎనిమిది దాటుతోంది!" అని లేపడానికి ప్రయత్నించింది. ఫలితం కనిపించలేదు. ఈసారి భర్తని తట్టి లేపింది. వెంకట్రావు లేచే ఛాయలు కనిపించలేదు.

నిద్రకోసం తపించిపోయిన వెంకట్రావు ఆ నిద్రలోనే శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయాడని తెలుసుకోడానికి రాజేశ్వరికి ఎంతోసేపు పట్టలేదు! ■